జూబ్లీహిల్స్ ఏసీపీగా వెంకట్‌రెడ్డికి
అదనపు బాధ్యతలు
సిట్‌కు పూర్తిస్థాయి అధికారిగా వెంకటగిరి

బంజారాహిల్స్,ఏప్రిల్ 29: జూబ్లీహిల్స్ ఏసీపీగా పనిచేస్తున్న వెంకటగిరికి ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక అధికారిగా పూర్తిస్థాయిలో బాధ్యతలు ఇవ్వడంతో ఆయన స్థానంలో బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. ఏడాది క్రితం జూబ్లీహిల్స్ ఏసీపీగా నియమితులైన వెంకటగిరి ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కోసం ఏర్పాటు చేసిన సిట్‌లో విచారణ అధికారిగా పనిచేస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోనే సిట్ కార్యాలయం ఏర్పాటు చేశారు. కాగా ఏడాది కాలం దాటినా కేసు విచారణ అనుకున్నంత వేగంతో ముందుకు సాగకపోవడంతో జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరిని పూర్తిస్థాయిలో సిట్ కోసం పనిచేయాలని ఆదేశించారు. దీంతో పాటు జూబ్లీహిల్స్ పీఎస్‌లో కొనసాగుతున్న సిట్ కార్యాలయాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయానికి మార్చారు. ప్రస్తుతం డీసీపీ కార్యాలయంలోని అదనపు డీసీపీ చాంబర్‌ను సిట్ అధికారులకు ఇవ్వడంతో అక్కడ పనిచేస్తున్న అదనపు డీసీపీ కృష్ణాగౌడ్ కార్యాలయాన్ని జూబ్లీహిల్స్‌కు మార్చారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్ట్
అప్రజాస్వామికం

హిమాయత్‌నగర్ ,ఏప్రిల్ 29: అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.
తమ అసోసియేషన్ ఎలాంటి ఆందోళనకు పిలుపు ఇవ్వకపోయినప్పటికీ అం గన్‌వాడీ టీచర్లతో పాటు రాష్ట్ర కోశాధికారి ప్యారీజాన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.పోలీసులు ఇష్టానుసరంగా వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

కల్యాణ్ నగర్ ట్రాఫిక్ సిగ్నల్ సమీపంలో.. ఏర్పడిన ట్రాఫిక్ జామ్

ఫంక్షన్ హాల్‌కు పార్కింగ్ లేకపోవడంతో రోడ్డు పొడవునా నిలిపిన కార్లు

ట్రాఫిక్ జామ్‌తో.. నిత్యం నరకం

- ఎక్కడపడితే అక్కడ..ట్రాఫిక్
- పద్మవ్యూహంలా మారిన కళ్యాణ్ నగర్ ప్రాంతం
- పుట్‌పాత్‌ను ఆక్రమించిన పండ్ల వ్యాపారి
- ఇక్కట్లు పడుతున్న ఛాతి దవాఖాన రోగులు
- ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్న అంబులెన్స్‌లు

వెంగళరావునగర్, ఏప్రిల్ 29 : అక్కడ ట్రాఫిక్.. పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. సర్కార్ ఛాతి దవాఖానకు వెళ్లే రోగులు ట్రాఫిక్ జామ్‌తో నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. ఫుట్‌పాత్‌ను పండ్ల వ్యాపారి ఆక్రమించడంతో రోడ్డు కుచించుకుపోయి ప్రమాదాలకు నిలయమైంది. ఎస్.ఆర్.నగర్– కళ్యాణ్‌నగర్ కూడలి రోడ్డు ట్రాఫిక్ సమస్య ప్రజలకు శాపంగా మారింది.

- వెంగళరావునగర్ కాలనీ కమాన్ నుంచి కళ్యాణ్ నగర్ చౌరస్తా వరకు రోడ్డు ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు అగచాట్లు పడుతున్నారు. ఈ మార్గంలో తెలంగాణ రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి కార్యాలయం, కుటుంబ సంక్షేమ కార్యాలయం, ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమిషన్ వంటి ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన ప్రభుత్వ ఛాతి దవాఖాన కూడా ఇక్కడే ఉంది. రాష్ట్రం నుంచే కాకుండా వేర్వేరు రాష్ట్రాల నుంచి రోగులు చికిత్స కోసం ఇక్కడికి వస్తుంటారు. ఈ రహదారిలో ప్రమాదకరమైన మలుపు వద్ద పుట్‌పాత్‌ను దర్జాగా పండ్ల వ్యాపారి కబ్జా చేశాడు.దాంతో రోడ్డు కుచించుకుపోయి ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.
- అత్యవసరంగా ఛాతి దవాఖానకు వెళ్లాలంటే ట్రాఫిక్ పోలీసులు ఇక్కడి దవాఖాన ముందు డివైడర్లతో మూసేయడంతో చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది.
- అంబులెన్స్‌లు సైతం కళ్యాణ్ నగర్ చౌరస్తా మలుపు వద్దకు వెళ్లి చుట్టూ తిరిగి ఛాతి దవాఖానకు వెళ్లాల్సి ఉంటుంది. కళ్యాణ్ నగర్ చౌరస్తా సిగ్నల్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి.
- గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు నిలపాలన్నా డివైడర్లు రోగుల పాలిట శాపంగా మారాయి. ఈ రోడ్డు పక్కన ఉన్న ఓయో హోటల్ కస్టమర్ల వాహనాలు రోడ్డుపై నిలుపుతుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. ఇకనైనా ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ పోలీసులు, బల్దియా అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఆక్రమణలు తొలగించి..ఛాతి దవాఖానకు వెళ్లే అంబులెన్స్‌లు, రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఓయో హోటల్ వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిపిన బైక్‌లు

దేశ ఆర్థిక వ్యవస్థలో యువత పాత్ర కీలకం

నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న నరేష్ రెడ్డి

హిమాయత్ నగర్ ,ఏప్రిల్ 29: దేశ ఆర్థిక వ్యవస్థలో యువత పాత్ర కీలకమని ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ నరేష్ రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో జాతీయ సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత దేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని,పలు రకాలుగా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఆర్థిక వ్యవస్థపై అధ్యయనం చేస్తూ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో నడిచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంచుకుని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఓబుల్ రెడ్డి, అప్పారావు,కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎండీహెచ్ఎం పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీహెచ్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 5వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు.
ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

ఖానాపూర్‌లో.. కమ్యూనిటీ హాల్ ప్రారంభం

మణికొండ, ఏప్రిల్ 29 : అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో రెండు కోట్ల 93 లక్షలతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బిగ్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డిలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మున్సిపాలిటీ సాధారణ నిధులతో రూ.2.92 లక్షలతో ఖానాపురం గ్రామానికి చెందిన అన్ని వర్గాల ప్రజల అవసరార్థం కమ్యూనిటీ హాల్ నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ కోట వేణు గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగి సహకార సంఘం చైర్మన్ మాజీ కౌన్సిలర్ జి. అమరేందర్ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి, డీఈ. నరేష్ కుమార్, ఏ ఈ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది,ముఖ్య ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో నూతన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

'కశ్మీర్ ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి'

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 29 : కశ్మీర్ ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని శంషాబాద్ మున్సిపల్ బీఆర్ఎస్ నాయకుడు ఉద్యమకారుడు గుంటి చరణ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. విహారయాత్రకు వెళ్లిన యాత్రికులపై దాడి చేసి 25 మంది అమాయక ప్రజల ప్రాణాలు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢసానుభూతి ప్రకటించారు. ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వినోదం కోసం వెళ్లిన పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి రక్తపుటేరులు పారించిన దోషులను శిక్షించి ఉగ్ర వాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక వాదానికి ఇది గొడ్డలి పెట్టులా మారిందన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

గెలుపొందిన టీమ్‌కు కప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, ఏప్రిల్ 29: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జర్నలిస్టులు మంగళవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్న జర్నలిస్టు క్రీడాకారులను అభినందించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో మొత్తం ఏబీసీడీగా నాలుగు టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం సమయపాలన లేకుండా కష్టపడుతుంటారు జర్నలిస్టులు అందరూ కలిసి ఒక రోజు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ తులా శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ రాజేంద్రగౌడ్ నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రవీంద్రభారతిలో మహాత్మా బసవేశ్వర జయంతి

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సంగమేశ్వర్, సతీశ్ కుమార్, మల్లికార్జునప్ప, శివశరణ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 29 : రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో నేడు రవీంద్రభారతిలో మహాత్మా బసవేశ్వర జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను జయంతి కమిటీ సభ్యులు సిందిరికేరి సతీశ్ కుమార్, కల్వ మల్లికార్జునప్ప, పట్లోళ్ల శివశరణ్ తో కలిసి ఆవిష్కరించారు. సంగమేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బసవేశ్వర జయంతిని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారికంగా నిర్వహించిదన్నారు. ఆ ఆనవాయితీలో భాగంగా నేడు వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, వివిధ శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వరప్ప, అనిల్ అప్ప, బస్వరాజ్, ఉమామహేశ్వర్, శెట్టి శివకుమార్, పరమేశ్వర్, భరత్, సోమేశ్, మహేశ్ పాల్గొన్నారు

మేయర్‌ను కలిసిన
కమిషనర్ ఆర్వీ కర్ణన్
జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆర్వీ కర్ణన్ మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. – సిటీబ్యూరో, ఏప్రిల్ 29 నమస్తే తెలంగాణ

సమస్యలు పరిష్కరించాలి
రహమత్ నగర్ డివిజన్‌లో తాగునీటి, సీవరేజీ సమస్యలపై కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మంగళవారం జలమండలి జీఎం ఎస్.హరి శంకర్‌తో సమావేశమయ్యారు. డివిజన్‌లో చేపట్టాల్సిన ఆయా పనులపై వినతిపత్రం అందజేశారు. – జూబ్లీహిల్స్, ఏప్రిల్ 29:

అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు
బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారిని జీ.వాణి పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని మైకేల్ కాలనీలో ఓ పార్కులో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని వారు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. – బండ్లగూడ, ఏప్రిల్ 29

వీధి వ్యాపారుల సంక్షేమం కోసం..

వీధి వ్యాపారుల కమిటీతో చర్చిస్తున్న డీసీ, ఇతర అధికారులు

జూబ్లీహిల్స్,ఏప్రిల్ 29: వీధి వ్యాపారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. మంగళవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో టౌన్‌కు చెందిన వీధి వ్యాపారుల సమావేశం నిర్వహించారు. వీధి వ్యాపారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేసేందుకు అర్హులైన వారిని గుర్తించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత కమిటీతో కలిసి అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడతారన్నారు. ఈ మేరకు యూసీడీ, డీపీఓ వెంకటకిషన్ రావును కమిటీ కన్వీనర్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సైదులు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసీద, ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్ రాజ్, టీఎల్ఎఫ్.. టీ వి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో
గ్రాడ్యుయేషన్ డే

చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 29: మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్‌లోని బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ సెంటర్–2లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజలు హాజరయ్యారు.
గ్రాడ్యుయేషన్‌ను ముగించిన ఐదేళ్లలోపు చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల విద్యారంగానికి ఇదోక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్ర కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్‌నివాస్, ఆర్వీ హేమలత, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, మాధవి, రత్న, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరుతో
సైబర్ మోసం

బంజారాహిల్స్,ఏప్రిల్ 29: ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరుతో నమ్మించి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 5లోని ధోబీఘాట్ బస్తీలో నివాసం ఉంటున్న నేతికుంట్ల మౌనిక ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగం కోసం చూస్తుండగా ఇటీవల నితీష్‌షెట్టి అనే వ్యక్తి కాల్ చేశాడు. తాను యాక్సిస్ బ్యాంకులో పని చేస్తున్నానని, తమ సంస్థలో పార్ట్‌టైమ్ ఉద్యోగం ఉందని నమ్మించాడు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం రూ.30 చెల్లించాల్సి ఉంటుందంటూ ఓ లింక్ పంపించాడు.ఆన్‌లైన్‌లో ఇంట ర్వ్యూ అంటూ స్క్రీన్ షేరింగ్ తీసుకుని బ్యాంక్ వివరాలు, ఓటీపీలు తీసుకున్న నితీష్‌షెట్టి ఆమె అకౌంట్‌నుంచి పలు దఫాలుగా రూ.95వేలు కాజేశాడు. ఈ మేరకు బాధితురాలు సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయం..
నలుగురు వ్యక్తులు అరెస్ట్

బంజారాహిల్స్,ఏప్రిల్ 29: ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాయదుర్గ ప్రాంతంలో నివాసం ఉంటున్న కే.వంశీకాంత్ అలియాస్ బబ్లూ(23) అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. అడ్డదారిలో డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించడం ప్రారంభించాడు. ఒరిస్సాకు చెందిన కృష్ణ అనే వ్యక్తితో పాటు షేక్‌పేటకు చెందిన కిషోర్ అనే వ్యక్తితో కలిసి గంజాయి విక్రయిస్తున్నాడు. కా గా సోమవారం రాత్రి 11గంటల ప్రాంతంలో షేక్‌పేట లోని పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద గంజాయి అమ్మేందుకు వచ్చిన వంశీకాంత్‌తో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన పోచమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ప్రవీణ్ అలియాస్ మోడల్ (22), ఆర్. దీపక్ (18) అనే విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 300గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన కురుక్షేత్ర –2025 క్రీడాపోటీలు
బంజారాహిల్స్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(జేఎన్ఐఏఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కురుక్షేత్ర–2025 క్రీడాపోటీలు ముగిసాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన 1500మంది విద్యార్థులు వివిధ క్రీడా అంశాల్లో పోటీ పడ్డారు. మంగళవారం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో పురపాలకశాఖ పట్టణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ చంద్రిక, జేఎన్ఐఏఎస్ డైరెక్టర్ డా. డి.సురేష్, ప్రిన్స్‌పాల్ శాలిని పాల్గొన్నారు. బంజారాహిల్స్

ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 29: ప్రజా అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను చేపడుతున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా వేయాల్సిన సీసీ రోడ్డు పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను చేపట్టాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు కాంట్రాక్టర్లతో చర్చించి నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేసేలా ఆదేశించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సురేందర్‌రెడ్డి, బబ్లు, జనార్దన్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్, కాంట్రాక్టర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌దానం...

ఆవుల అలివేలు (ఫైల్)

బైరు రాజేశ్ (ఫైల్)

ఖైరతాబాద్, ఏప్రిల్ 29 : విధి వక్రీకరించి వారు మరణించినా అవయవదానం ద్వారా ఇతరులకు జీవన దానం చేశారు. జీవన్‌దాన్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం...నల్గొండ జిల్లా గొట్టిముక్కలకు చెందిన ఆవుల అలివేలు (49) గృహిణి. ఈ నెల 23న ఇంట్లో ఒక్కసారిగా అపస్మారక స్థితిలో పడిపోయారు. కుటుంబ సభ్యులు ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 28న బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవ దానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. కాలేయం రెండు మూత్ర పిండాలు, కార్నియాలను సేకరించారు.

మరో ఘటనలో...

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నందనం గ్రామానికి చెందిన బైరు రాజేశ్ (23) కటింగ్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నెల 22న బైక్‌పై నుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తొలుత ఎంజీఎం దవాఖానలో చూపించినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 28న బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. ఆయన శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలను సేకరించారు.

నివాళి: ఉగ్రదాడిని నిరసిస్తూ ..మంగళవారం కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ కళాశాల ఆవరణలో అసోసియేట్ డీన్ డాక్టర్ పి ప్రశాంత్ ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం శాంతి కపోతం ఎగురవేశారు. –వ్యవసాయ యూనివర్సిట